


## చలో హైదరాబాద్‌ను విజయంతం చేయాలి

గోదావరిఖని, సెప్టెంబర్ 22: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 30న చలో హైదరాబాద్ పేరిట తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈదునూరి రామకృష్ణ పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు, మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ నాయకులు ఈ నరేశ్, జీ మల్లేశం, ఎడ్ల రవికుమార్, ఎన్ రాజేందర్, ఎన్ ప్రసాద్, సాంబయ్య, తదితరులు ఉన్నారు.

## నేడు బ్లాక్‌డేగా పాటించాలి

గోదావరిఖని, సెప్టెంబర్ 22: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక నిరసనలో భాగంగా ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు సెప్టెంబర్ 23ను బ్లాక్ డేగా పాటించాలని హెచ్ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో జరిగిన సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో కేంద్రం మూడు లేబర్‌కోడ్‌లను ఆమోదించిన రోజును బ్లాక్‌డేగా పాటిస్తూ సంఘీభావం తెలపాలని కోరారు.

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్22: కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 23న బ్లాక్ డేగా పాటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కే విశ్వనాథ్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట బ్లాక్ డే కర పత్రాలు విడుదల చేశారు. ఇక్కడ సీఐటీయూ సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, నాయకులు వెంకటస్వామి, అశోక్, శ్రావణ్ ఉన్నారు.

## బహుమతులు అందజేత

జ్యోతినగర్, సెప్టెంబర్ 22: ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల క్రికెట్ మ్యాచ్‌లో విజేతలకు కాంట్రాక్టర్ ఏబీసీ రెడ్డి ఆదివారం ట్రోఫీలు అందజేశారు. విన్నర్‌గా ఏ గ్రూప్, రన్నర్‌గా గెలిచిన డీ గ్రూప్ కెప్టెన్ల బహుమతులు అందజేసి అభినందించారు.

## రామయ్యపల్లికి హెల్త్ సబ్ సెంటర్ మంజూరు

రామగిరి, సెప్టెంబర్ 22: మండలంలోని రామయ్యపల్లి (బుధవారం పేట) గ్రామానికి హెల్త్ సబ్ సెంటర్ మంజూరైంది. ఈమేరకు ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి రూ.20లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మాజీ సర్పంచ్ బుద్ధార్థి బుచ్చయ్య, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## చోరీ చేసిన ఆభరణాలు విక్రయిస్తూ దొరికిన దొంగ

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 22: రామగుండంలోని హనుమాన్ ఆలయంలో రెండురోజుల క్రితం వెండి అభరణాలను చోరీ చేసిన ఓ దొంగ ఆదివారం గోదావరిఖనిలో పట్టుబడ్డాడు. ఆ ఆభరణాలను ఓ స్వర్ణకారుడి షాపులో విక్రయించేందుకు రాగా, అక్కడే మాటువేసిన ఆలయ పూజారి, కమిటీ సభ్యులు దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

## బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

ముత్తారం, సెప్టెంబర్ 22: రంగయ్యపల్లి నుంచి ఖమ్మంపల్లి వెళ్లే మూలమలుపు వద్ద బైక్ ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో గోపాల్ పూర్‌కు చెందిన సిద్దుల శంకర్, తాడిచర్లకు చెందిన పెంచాల సమ్మక్క అన్నాచెల్లెళ్లు బైక్ పై వెళ్తుండగా మూలమలుపు వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో వీరిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ వంశీధర్ రెడ్డి, పైలెట్ రాజు ప్రాథమిక చికిత్స అందిస్తూ మంథని సామాజిక వైద్యశాలకు తరలించారు.

# సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల లెక్కెంత..?

- సర్కారు ప్రకటించిన బోనస్ అందేనా..?
- సంస్థ వద్ద వివరాలు అంతంత మాత్రమే..
- ఇంకా ఖరారు కాని విధివిధానాలు
- అయోమయంలో కాంట్రాక్ట్ కార్మికులు

పెద్దపల్లి, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు లాభాల వాటాను ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) సింగరేణి సాధించిన రూ.4701 కోట్ల లాభాల్లో సంస్థ వ్యాపార విస్తరణ ప్రణాళికల కోసం రూ.2,289 కోట్లను పక్కన పెట్టగా, మిగిలిన రూ.2412 కోట్లపై 33 శాతాన్ని లాభాల వాటా బోనస్‌గా కార్మికులకు చెల్లిస్తామని పేర్కొంది. అంటే ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.90లక్షలు అందనుండగా, సింగరేణి చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి కాంట్రాక్టు కార్మికులకూ లాభాల్లో వాటా కింద ఒక్కో కార్మికుడికి రూ.5వేలు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే సింగరేణి వ్యాప్తంగా 25 వేల మంది వరకు కాంట్రాక్టు, పొరుగు సేవల సిబ్బంది పనిచేస్తున్నట్లుగా సర్కారు పేర్కొంటుండగా, వీరిలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారికి నిబంధనల ప్రకారం బోనస్ అందనున్నది. అయితే అసలు సింగరేణి వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు కార్మికుల లెక్కెంత.. వారికి అసలు ఈ బోనస్‌ను అందించడం ఎలా అనేదే ఇక్కడ చిక్కు ప్రశ్నగా మారింది. కార్మికుల లెక్క, బ్యాంకు ఖాతాల వివరాలు సింగరేణి వద్ద ఉండే అవకాశం లేదు. ఎందుకంటే వారు సంస్థలో నేరుగా ఉద్యోగాలు చేయడం లేదు. యాజమాన్యం వారికి జీతాలే ఇవ్వదు. కాంట్రాక్టరే చెల్లిస్తాడు. అంటే బోనస్‌ను తిరిగి కాంట్రాక్టర్ల ద్వారానే చెల్లించాల్సిన పరిస్థితి. అయితే కాంట్రాక్టర్‌కే ఆ డబ్బులు ఇచ్చి కార్మికులకు అందేలా చేస్తారా..? లేదా ఇంకేమైనా విధానం ఉందా..? అన్నది తేలడం లేదు. ఒకవేళ అలాగే చేస్తే కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని భావిస్తే.. ఈ సొమ్ము వారికి చేరుతుందా..? ఒక వేళ చేరినా కాంట్రాక్టర్లు చెల్లింపులు చేస్తారా..? అన్నది ఇక్కడ అనుమానంగా మారింది. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ పేరుతో ఉన్న జీతాలే వారికి సరిగ్గా ఇవ్వని కాంట్రాక్టర్లు, ఇప్పుడు ఈ బోనస్ వారికి ఇస్తారా? అన్నది సందేహంగా ఉంది. అసలు సింగరేణి వ్యాప్తంగా 25వేల మందే కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారా..? వారి లెక్క ఎప్పుడు తీశారో..? తేలాల్సి ఉంది. లెక్కతీసిన తర్వాత ఎవరెవరికి ఇది వర్తింపచేస్తారనే దానిలో స్పష్టత లేదు. ఓబీ తీసే కాంట్రాక్టు వర్కర్లు కూడా సింగరేణిలో భాగమే. మరి వారికి కూడా దీన్ని వర్తింప చేస్తారా.? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వెంటనే యాజమాన్యం తమ ఖాతాల వివరాలు తీసుకొని నేరుగా వారికి బోనస్‌ను జమచేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## లాభాల్లో కాంగ్రెస్ మోసాన్ని ఎండగడుతాం

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబర్ 22: సింగరేణి కార్మికులకు లాభాల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసానికి వ్యతిరేకంగా దశల వారీగా నిరసన పోరాటాలు చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ప్రకటించిన రూ.4,701 కోట్ల నికర లాభాలపై 33శాతం వాటా చెల్లించకుండా కేవలం రూ.2,412 కోట్లపైనే ప్రకటించడం చూస్తే సర్కారుకు సింగరేణికి కార్మికులపై ఏ మేరకు ప్రేమ ఉందో తెలుస్తున్నదని దుయ్యబట్టారు. కార్మికులకు రూ.796 కోట్ల లాభాలను మాత్రమే పంచుతామని చెప్పడం సరికాదని, కార్మికుల వాటా కింద వచ్చే రూ.1,550కోట్లను పంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 23న కార్మికులు నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరవుతారని, 24న రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తారని, 25న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేస్తారని వివరించారు. ఇక 26న కార్మికుల సంతాల సేకరణతో ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులకు పంపిస్తారని వెల్లడించారు. కార్మికుల మనోభావాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకుంటే హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకుడు వాసిరెడ్డి సీతారామయ్య ఇతరులను నిందించే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని హితవుపలికారు. 2023-24 సంవత్సరంలో బొగ్గు ధర పెరిగిన విషయంగా 30లక్షల టన్నుల బొగ్గు అధికంగా గత సంవత్సరం కంటే ఉత్పత్తి చేసిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఇక్కడ టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, కేంద్ర నాయకులు చల్ల రవీందర్‌రెడ్డి, పింగళి సంపత్‌రెడ్డి, ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, నాయకులు ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, భాస్కర్, సత్యనారాయణ, దేవేందర్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్22: పెగడపల్లికి చెందిన సుముఖం సరోజన ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆదివారం పరామర్శించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీ సుముఖం నిర్మల మల్లారెడ్డి, బీఆర్ఎస్‌వై అధ్యక్షుడు నూనేటి కుమార్, నాయకులు రవీందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కూకట్ల నవీన్, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

ఓదెల, సెప్టెంబర్ 22: కనగర్తికి చెందిన మొగిలి గట్టుమల్లు ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## కార్యవర్గం

సుల్తానాబాద్, సెప్టెంబర్ 22 :ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని పట్టణంలోని సాయిరాం గార్డెన్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పూసాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శశివర్ధన్, కోశాధికారిగా మేరుగు హరీశ్‌ను ఎన్నుకున్నారు. సంఘం ఐక్యతకు ఏకగ్రీవ ఎన్నికలే నిదర్శమని పోగుల విజయ్ అన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు బీట్ల రమేశ్, యెల్లె రాజు, బోయిని వినోద్, రాపోలు తిరుపతి, సంపత్, చింటూ, శివ, హరీశ్, ఫొటో ఫామ్ అధినేత రేకులపల్లి శశాంక పాల్గొన్నారు.


## పంచాయతీ కార్యదర్శికి వీడ్కోలు

సుల్తానాబాద్‌రూరల్, సెప్టెంబర్ 22: గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రమోద్ కుమార్‌కు వీడ్కోలు పలుకుతూ, నూతన కార్యదర్శి మహేశ్‌కు స్వాగతం పలికారు. స్థానిక జీపీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ బండారి రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో రమేశ్, రాజు, అంజి, కుమార్, లక్ష్మయ్య, సంపత్, శంకర్, రజిత, రవి ఉన్నారు.

## మన్నించు..గణనాథ

- నీట మునగక గోదావరిలో పేరుకపోయిన విగ్రహాల శిథిలాలు

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 22: ఎంతో వైభవంగా నవరాత్రులు పూజలందుకున్న గణనాథులను గోదావరిలో నిమజ్జనం చేయగా, నదిలో నీరులేక విగ్రహాల శిథిలాలు పేరుకుపోయాయి. ఈ నెల 16న గోదావరి బ్రిడ్జి మీదుగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జనం అయ్యాక అధికారులు చేతులెత్తేశారు. దీంతో గోదావరిలో విగ్రహాల శిథిలాలు కోల్ బెల్ట్ వంతెన పొడవునా పేరుకుపోయాయి. నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోని భక్తుల మనోభావాలను గౌరవించేలా వాటిని నిమజ్జనం చేయాలని భక్తులు కోరుతున్నారు.



గోదావరిలో పేరుకుపోయిన విగ్రహాల శిథిలాలు

# మంచిర్యాలలో ఘరానా సైబర్ మోసం

- ఓ వ్యాపారవేత్తకు రూ.1,43,75,000ల టోపీ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- ముఠా సభ్యుడి అరెస్ట్

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 22: మంచిర్యాలలో భారీ సైబర్ మోసం వెలుగుచూసింది. ఓ వ్యాపారవేత్తకు ఫోన్ చేసి బెదిరించి ఫోన్‌రూ.కోటి 43లక్షల75వేలు లూటీ చేసిన ఘటన ఆలస్యంగా బయటపడింది. ఆదివారం రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, సీఐ కృష్ణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్త గత జూలై 22న గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'హలో నేను ముంబాయి పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్న. మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఈ కేసు నుంచి బయటపడాలంటే చెప్పిన మేం చెప్పిన అకౌంట్ నంబర్‌కు డబ్బును త్వరగా పంపించాలి. మీ డబ్బును చెక్ చేసిన తర్వాత తిరిగి మీ అకౌంట్‌కు పంపిస్తాం. లేదంటే జైలుకు వెళ్లక తప్పదు' అంటూ బెదిరించడంతో బాధితుడు వణికిపోయాడు. అతని మాటలు నమ్మి భయంతో రూ.కోటి 43లక్షల 75వేలు పలు దపాలుగా ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయితే డబ్బులు తిరిగి తన అకౌంట్‌కు రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయగా డీజీపీ, రామగుండం సీపీ ఆదేశాల మేరకు రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, సీఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సైబర్‌క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుడు మనీ ట్రాన్స్‌ఫర్ చేసిన బ్యాంక్ అకౌంట్ మహారాష్ట్రలోని వాసిం జిల్లాలోని సంతోశ్ శ్రీకృష్ణ నాగల్కర్‌దిగా గుర్తించారు. మహారాష్ట్రకు వెళ్లి, ముఠా సభ్యుడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతని అకౌంట్‌కు వచ్చిన మనీ మరో అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ జరిగినట్లు గుర్తించారు. అతన్ని విచారించగా, డబ్బులు వచ్చిన మాట నిజమేనని, వాటిపై తాను కమీషన్ మాత్రమే తీసుకుంటానని అంగీకరించడంతో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని, అసలు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా, ఈ నిందితుడి అకౌంట్ ద్వారా ఇప్పటివరకు 18 సైబర్ నేరాలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.



పోలీసుల అదుపులో నిందితుడు

## మిత్రుడి కుటుంబానికి చేయూత

పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్ 22: ముత్తారం పరిధి ధర్మాబాద్‌కు చెందిన న్యాడెం రమేశ్ ఇటీవల మృతి చెందాడు. మిషన్ హైస్కూల్‌కు చెందిన అతని చిన్ననాటి మిత్రులు స్పందించి బాధిత కుటుంబానికి రూ.22 వేలు, నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. రమేశ్ కూతురు పేరిట డిపాజిట్ చేసిన పోస్టల్ బాండ్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు. మంథని కృష్ణ, అల్లాడి హరిబాబు, జహంగీర్, ఆంజనేయులు, సాగర్, నలగొండ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు..